ప్రజాశక్తి

సోమవారం 13 మే 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



పోలింగ్ సామగ్రితో గుంటూరు ఏసీ కాలేజీ నుండి పోలింగ్‌కేంద్రాలకు బయలుదేరిన సిబ్బంది



నరసరావుపేట నుండి వెళ్తున్న పోలింగ్ సిబ్బంది

ఓటరు తీర్పు నేడు

- ఏర్పాట్లను పూర్తిచేసిన అధికారులు
- ఈవిఎంలతో పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది
- తొలిసారిగా ఓటేసేందుకు సిద్ధమైన యువత

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈవిఎంలు, వీవీప్యాట్‌లు, ఇతర సామగ్రితో ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ఆదివారం ఉదయం నుంచి ఎన్నికల సరంజామా పంపిణీ చేపట్టారు. వీటిని తీసుకుని అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాలకు చేరుకున్నారు. ఆదివారం రాత్రి 10 గంటల కల్లా గుంటూరు, పల్నాడు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలు ఈవిఎంలు, ఇతర సామగ్రి చేరిందని సోమవారం ఉదయం 7 గంటల కల్లా పోలింగ్ జరుగుతుందని అధికారులు తెలిపారు. పోలింగ్‌కేంద్రం అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, సిబ్బంది దాదాపు 30 వేల మంది వరకూ విధుల్లో పాల్గొంటున్నారు. 9 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తులో పాల్గొంటున్నారు.

పోలింగ్ సోమవారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరగనుంది. గుంటూరు, నర్సరావుపేట లోక్‌సభ స్థానాలకు, 14 అసెంబ్లీ స్థానాలకు కలిపి 288 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. గుంటూరు లోక్‌సభ పరిధిలో 162 మంది, నర్సరావుపేట లోక్‌సభ పరిధిలో 122 మంది పోటీ చేస్తున్నారు. టిడిపి, వైసిపి, కాంగ్రెస్, వామపక్షాలు, జనసేనతోపాటు పలు రిజిస్ట్రర్డ్ పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు దాదాపు 100 మంది వరకు ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గుంటూరు లోక్‌సభ పరిధిలో 17,91,543 మంది ఓటర్లు ఉన్నారు. 1,915 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి 30 మంది అభ్యర్థులు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 132 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించడానికి 2,300 మంది పీఓలు, 2,300 మంది ఏపీఓలు, 9,800 మంది ఓపిఓలను నియమించారు. జిల్లాలో 1,915 పోలింగ్ కేంద్రాలో 372 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక్మమైనవిగా గుర్తించారు. 1,498 పోలింగ్ కేంద్రాల్లో (78 శాతం) వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. ▶ 2లో

పల్నాడు జిల్లాలో ఏర్పాట్లు

నరసరావుపేట లోక్‌సభ పరిధిలో మొత్తం 1929 పోలింగ్ కేంద్రాలున్నాయి. 17,20,526 మంది ఓటర్లున్నారు. మొత్తం 557 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. మొత్తం 1929 పోలింగ్ కేంద్రాల్లో పీవోలు 2125, ఏపీవోలు 2125, ఓపివోలు 8319, మైక్రో అబ్జర్వర్లు 466, సెక్టార్ అధికారులు 187 మంది పనిచేస్తారు. మొత్తంగా 13,035 మంది ఉద్యోగులు పోలింగ్ విధుల్లో పాల్గొటారు. గురజాలతో అత్యధికంగా 2,71,913 మంది ఓటర్లున్నారు. జిల్లాలో మొత్తం 122 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో 15 మంది నర్సరావుపేట లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తుండగా 107 మంది ఏడు అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తున్నారు. ఓటర్లు పెరగడం వల్ల సాయంత్రం 6 గంటల తర్వాతా పోలింగ్ జరుగుతుందని అధికారులు అంచనా. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జెఎన్‌టియులో ఈవిఎంలకు భద్రత

నర్సరావుపేటలోని జెఎన్‌టియు కళాశాలలో ఈవిఎంలకు భద్రత కల్పించనున్నారు. ఏడు స్ట్రాంగ్ రూమ్‌లలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన 1929 ఈవిఎంలను ఉంచనున్నారు. వచ్చేనెల 4న ఇక్కడే ఓట్ల లెక్కింపు జరగనుంది.

ఆకలితో సిబ్బంది నకనక

- పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద సదుపాయాల లేమి
- 200 మందికి పైగా సరిపడకుండా భోజనం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో డిస్టిబ్యూషన్ కేంద్రాల వద్ద సదుపాయాల లేమి కనిపించింది. ఎన్నికల సామగ్రితో ఆయా పోలింగ్ కేంద్రాలకు మియామక పత్రాలను అందుకొని వెళ్లాల్సిన 1691 మంది సిబ్బంది సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద అవస్థ పడ్డారు. మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనం చేసేందుకు సిబ్బంది మొత్తం వరుస కట్టారు. చివరకు వచ్చే సరికి 200 మందికి పైగా ఆహారం సరిపోలేదు. దీంతో పలువురు సమీపంలోని హోటళ్లకు వెళ్లి తమ సొంత డబ్బులతో భోజనం చేశారు. తాత్కాలికంగానైనా వ్యక్తిగత మరుగుదొడ్లు ఏర్పాటు చేయకపోవడంతో సిబ్బందంతా అసౌకర్యానికి గురయ్యారు.



పంపిణీ కేంద్రం వద్ద భోజనం అయిపోవడంతో అసహనంగా ప్రశ్నిస్తున్న సిబ్బంది

భారీగా సొంతూర్లకు ఓటర్లు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నేడు సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఓటు వేసేందుకు వివిధ ప్రాంతాల్లోని మాచర్లకు చెందిన వారంతా ఆదివారం భారీగా తరలివచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్కువ సంఖ్యలో ఓటర్లు తరలిరావడం ఇరు పార్టీలు ఈ ఎన్నికలను ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయెూ అర్థమవుతోంది. ఇతర ప్రాంతాల నుండి సొంతూళ్లకు వచ్చే ఓటర్లకు ఆయా పార్టీలకు చెందిన ముఖ్యనాయకులు వాహనాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బోర్డర్ చెక్‌పోస్టు ద్వారా వచ్చిపోయే వాహనాలను, బస్సులను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించారు. పటిష్ట నిఘా ఉంచారు.



రూ.2.55 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించి పోలింగ్‌కు ముందురోజైన ఆదివారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు నిర్వహించిన తనిఖీల్లో నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో రూ.1,23,000 నగదు, తాడికొండ నియోజకవర్గంలో రూ.32 వేల నగదు, తెనాలి నియోజకవర్గంలో రూ.లక్ష నగదు సీజ్ చేశారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకూ మొత్తం రూ.3 కోట్ల 90 లక్షల 37 వేల 11 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశారు.

పల్నాడు జిల్లాపై పోలీసుల డేగకన్ను

- నాలుగు నియోజకవర్గాలపై ప్రత్యేక నిఘా
- జిల్లాకు చేరిన 20 కంపెనీల కేంద్ర బలగాలు

2వ పేజీ

ప్రశాంతంగా ఓటేసి వెళ్లండి..



పోలీసు కవాతులో కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల పోలింగ్ సజావుగా సాగేందుకు సర్వం సిద్ధం చేశామని పల్నాడు జిల్లా ఎన్నికలాధికారి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ జి.బిందుమాధవ్ చెప్పారు. పోలీసు, సిఆర్‌పిఎఫ్, కేంద్ర బలగాలతో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని పల్నాడు బస్టాండ్ నుంచి మల్లమ్మ సెంటర్ వరకు ఆదివారం పోలీస్ కవాతు నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలు పర్యవేక్షణకు కేంద్ర ప్రభుత్వం 19 బెటాలియన్‌ల సిఆర్‌పిఎఫ్ సిబ్బందిని 4000 మందికి పైగా జిల్లాకు కేటాయించారని చెప్పారు. వారిని పోలీస్‌స్టేషన్‌లా విభజించి వివిధ ప్రాంతాలకు పంపినట్లు చెప్పారు. ప్రజలలో భరోసా కలిగించి వారు ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టామన్నారు. గత నెలరోజులుగా పోలీస్ సిబ్బంది సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల పరిధిలో ఎన్నికల నియమావళి ఉల్లంఘించకుండా, సజావుగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా తీసుకునే కఠిన చర్యలను వివరించారని చెప్పారు. పటిష్ట భద్రత మధ్య పోలింగ్ జరుగుతుందని, ప్రజలంతా తమకు సహకరించాలని కోరారు.



చంద్రశేఖర్‌తో జయదేవ్ భేటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ టిడిపి లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరు కుటుంబాలకు కుటుంబ సత్సంబంధాలు ఉన్న నేపథ్యంలో ఆ ఇరువురు కలిసి కాసేపు మాట్లాడుకున్నారు. గల్లా జయదేవ్, ఆయన కుటుంబ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకునే నిమిత్తం ఆదివారం సాయంత్రానికి గుంటూరుకు చేరుకున్నారు. సోమవారం వారు ఓటు హక్కును వినియోగించుకోబోతున్నారు. ఈ క్రమంలో గుంటూరుకు చేరుకున్న గల్లా జయదేవ్.. పెమ్మసాని చంద్రశేఖర్, ఆయన కుటుంబంతో కలిసి భోజనాలు చేశారు. అనంతరం జయదేవ్ మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో విజయం చేకూరాలని పెమ్మసానికి అభినందనలు తెలియజేశారు.



ఆందోళన చేస్తున్న రైతులు

తుళ్లూరులో రైతుల ఆందోళన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాష్ట్రం ప్రగతిపథంలో పయ నించేందుకు అమ రావతి రాజధాని నిర్మాణం దోహదపడుతుందని రైతులు స్పష్టం చేశారు.రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొన సాగించాలంటూ రైతులు, రైతు కూలీలు,మహిళలు చేస్తున్న ఆందోళనలు ఆదివారంతో 1608 వ రోజుకు చేరాయి.తుళ్లూరు, వెంకటపాలెం,నెక్కల్లు, అనంతవరం తదితర గ్రామాల్లో ఆందోళనలు సాగాయి. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి నినాదాలు చేశారు.

ఓటరు తీర్పు నేడు

(మొదటి పేజీ తరువాయి)

సమసాత్మకమైన పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 487 మందిని మైక్రో అబ్జర్వర్లు, పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణకు 176 మందిని సెక్టార్ ఆఫీసర్లును ఎంపిక చేశారు. పోలింగ్ కేంద్రాల లోపల, క్యూ లైన్లకు మూడు వేల సీసీ కెమెరాలతో పాటు 187 మంది వీడియోగ్రాఫర్ల ద్వారా పర్యవేక్షణ ఉంటుంది. గత ఎన్నికల్లో జరిగిన ఘటనలు, గత ఏడాదికాలంలో జరిగిన ఘర్షణలు, రాజకీయ వివాదాలను ఆధారంగా చేసుకుని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా పరిగణిస్తున్నారు. ఈసారి పలు నియోజకవర్గ వర్గాల్లో భారీగా ఓటర్లు పెరగడం వల్ల ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సమయం ఇచ్చారు. అయినా ఆరు గంటల తరువాత కూడా పోలింగ్ జరిగే అవకాశం ఉండటంతో రాత్రి వేళ లైట్లు కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గుంటూరు జిల్లాలో మంగళగిరి, గుంటూరు పశ్చిమలో అత్యధిక ఓటర్లున్నారు. మంగళగిరిలో 2,92,432 మంది ఓటర్లుండగా గుంటూరు పశ్చిమలో 2,78,158 మంది ఉన్నారు.

ఎఎన్‌యులో 7 నియోజకవర్గాల ఈవిఎంల భద్రం


ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గుంటూరు లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవిఎంలు, వివిప్యాట్‌లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరుస్తున్నారు. 7 నియోజకవర్గాల పరిధిలో లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు వచ్చేనెల 4న నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తారు.

ఓట్ల కోసం నోట్ల ఎర!

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎన్నికల్లో గెలవడానికి ప్రజాభిమానంపై ఆధారపడకుండా ధన ప్రభావాన్నే ప్రధాన పార్టీల అభ్యర్థులు నమ్ముకున్నారు. ఎన్ని అడ్డదారులైనా తొక్కి.. ఎంత డబ్బయినా పంచి గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. మొన్నటి వరకూ ప్రచారం సందర్భంగా ఇచ్చిన డబ్బు, మద్యం ఒకెత్తయితే శని, ఆదివారాల్లో ఈ ప్రలోభాలు తారాస్థాయికి చేరాయి. గతంలో లేనంతగా ఓటర్లకు డబ్బుల ఎరవేస్తున్నారు.

నియోజకవర్గంలో 2.25 లక్షలకుపైగా ఓటర్లున్నారు. వీరిలో చిలకలూరిపేట పట్టణంలో 85 వేల మంది ఉన్నారు. పట్టణాల్లో అయితే రూ.2వేలు, గ్రామాల్లో అయితే రూ.1500 చొప్పున రెండు పార్టీల వారూ పంచుతున్నారని తెలిసింది. ఓటరు స్లిప్ పేరుతో ఇళ్లకు వెళ్లి ఆ ఇంట్లో ఎన్ని ఓట్లు ఉంటే అన్ని ఓట్లకు లెక్కగట్టి డబ్బులిచ్చి వస్తున్నారని సమాచారం. రాత్రివేళల్లోనే ఈ



తతంగం ఎక్కువగా జరుగుతోంది. ఎన్నికల మొత్తంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు రూ.60-70 కోట్ల వరకూ ఖర్చు చేస్తున్నట్లు ప్రచారమవుతుండగా ఇందులో చివరి రెండ్రోజుల్లో ఖర్చే సగానికి పైగా ఉంటుందని అంచనా.

మరోవైపు ఓటర్లందరికీ డబ్బు పంచాలని, పార్టీ విభేదాలు చూడొద్దని ప్రధాన నాయకులు చెబుతుండగా క్షేత్రస్థాయిలో వారు మాత్రం కొందరికి ఇవ్వడంలేదని, అదే వివాదాలకు దారితీస్తోందని తెలుస్తోంది. ఓ ప్రాంతంలో ఒక పార్టీకి చెందిన వారు ఓటర్లందరికీ డబ్బులివ్వగా మరో పార్టీవారు వచ్చి తమ పార్టీ అనుకూరులకే ఇచ్చి కొంతమందిని ప్రత్యర్థి పార్టీ అభిమానులుగా భావించి ఇవ్వలేదని తెలిసింది. దీంతో స్థానికులు వారితో వివాదం పెట్టుకున్నారని సమాచారం. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం మాత్రం ఈ డబ్బు పంపిణీ నియంత్రణపై దృష్టిపెట్టలేదనే విమర్శలు వస్తున్నాయి. పట్టణంలో 80 వరకూ సిసి కెమెరాలు ఉండగా వీటిల్లో సగం వరకూ పని చేయడం లేదు. మిగతా పని చేస్తున్న సిసి కెమెరాలను పరిశీలించినా డబ్బు పంపిణీ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందనే వ్యాఖ్యలు వస్తున్నాయి.

డబ్బు పంచుతున్న ఇద్దరి పట్టివేత

ప్రజాశక్తి - కారంపూడి

ఓట్లకు డబ్బులు పంచుతుండగా ఇద్దర్ని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మండలంలోని వేపకంపల్లిలో ఆదివారం ఉదయం ఇద్దరు వచ్చి ఓటరు జాబితా ఆధారంగా డబ్బులు పంచుతుండగా స్థానికులు గమనించారు. వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారి వద్ద రూ.3,85,000 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేశారు. అయితే వారి వివరాలను మాత్రం వెల్లడించలేదు.

పల్నాడు జిల్లాపై పోలీసుల డేగకన్ను

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పల్నాడు జిల్లాలపై ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా దృష్టిసారించింది. జిల్లా పరిధిలో నాలుగు నియోజకవర్గాల్లో ఎక్కువగా ఘర్షణలు జరగడానికి అవకాశం ఉన్నట్టుగా గుర్తించింది. మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో సమస్యాత్మక గ్రామాలపై పోలీసు అధికారులు దృష్టి సారించారు. ప్రధానంగా ఘర్షణలు జరగడానికి ఆస్కారం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా విధించాలని నిర్ణయించారు. 6 వేలమంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. 20 కంపెనీల కేంద్ర బలగాలు పల్నాడు జిల్లాకు చేరుకున్నాయి. జిల్లాలో 558 సమసాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్టు ఎస్‌పి గరికపాటి బిందు మాధవ్ తెలిపారు. ఆయా కేంద్రాలకు పారా మిలటరీ బలగాలను రప్పించారు. మాచర్ల నియోజకవర్గంలో ఒక ఎస్‌పి అధికారిని పర్యవేక్షణకు నియమించారు. ఇతర నియోజకవర్గాలకు అదనపు ఎస్‌పిలను పర్యవేక్షకులుగా నియమించారు.

గురజాల నియోజకవర్గం పరిధిలో పొందుగల చెక్‌పోస్టు వద్ద నిఘా ఉన్నా అక్రమ మద్యం జిల్లాకు వస్తోందన్న విమర్శలున్నాయి. 2019 ఎన్నికల్లో పల్నాడు జిల్లాలోనే ఎక్కువ గ్రామాల్లో టిడిపి, వైసిపి కార్యకర్తల మధ్య దాడులు జరిగాయి. రాజుపాలెం మండలంలో అప్పటి స్పీకర్ కోడెల శివప్రసాదరావుపై కూడా దాడి జరిగింది. మాచర్ల, గురజాల, నర్సరావుపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో సమస్యాత్మక గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. దాదాపు 300 గ్రామాల్లో పరస్పర ఘర్షణలకు ఆస్కారం ఉందని అంచనాతో పారా మిలటరీ దళాలను ఎక్కువగా వినియోగించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈసారి 2019 కన్నా ఘర్షణలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. పోలింగ్ మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుండటంతో ఆదివారంరాత్రి గ్రామాల్లో పోలీసులు విస్తృతంగా సంచరిస్తున్నారు. ప్రజలను ఇళ్ల నుంచి బయటకు రానివ్వకుండా దుకాణాలు, వ్యాపార సంస్థలను మూయిస్తున్నారు.

ఉపశమనం కాదు.. ఉపద్రవమే..

- చల్లని ద్రవ పదార్థాలతో అనారోగ్య సమస్యలు
- ఇన్‌ఫెక్షన్ల బారిన పడితే గుండె, ఊపిరి తిత్తులకు దెబ్బ
- శీతల పానీయాలు, ఐస్ క్రీంలు, ఫ్రిజ్ నీటితో అనర్థమే



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



వేసవిలో కొద్ది సేపటికే గొంతెండుతుంది. ఎండకు వెళ్లి అలిసి నీడకు రాగానే వెంటనే ఫ్రిజ్ తీసి గటగటమంటూ చల్లని నీటిని తాగేసి ఉపశమనం కలిగినట్లు అనిపించి కాస్త సాంత్వన పొందుతాం. కానీ చల్లని నీటితో ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఫ్రిజ్ వాటర్ తాగిన వారిలో ఎక్కువ శాతం మంది గొంతు సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. చిన్న పిల్లల్లో ఈ పరిస్థితి మరింత ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. కూలింగ్ వాటర్ తాగడం ఫ్యాషన్‌గా భావిస్తున్న ఈ రోజుల్లో అది ఆరోగ్యానికి చేటు చేస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ప్రస్తుతం ఎండ వేడిమిని శరీరం తట్టుకోవాలంటే రోజుకు కనీసం 5 నుండి 6 లీటర్ల నీరు తాగాలి. శరీరంలోని కాలుష్యాన్ని కడిగేందుకు నీరు ఎంతో ఉపకారం చేస్తుందని, తగిన జాగ్రత్తలు పాటించకుంటే అదే నీరు మన ప్రాణాల

వీ ం ద్ క్ ం

తెస్తుందని, ఆరోగ్యాన్ని దెబ్బతీసి బిక్కిరి చేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఫ్రిజ్ వాటర్‌కు దూరంగా ఉండాలంటున్నారు. ఫ్రిజ్ నీరు నేరుగా గొంతు గొంతులోని భాగాలను ప్రభావితం చేస్తుంది. గుండె, ఉపిరితిత్తులు, రక్తనాళాలకూ ముప్పు తెస్తుంది. గతేడాది ఈ సీజన్‌లో గొంతు వ్యాధులు గణనీయంగా పెరిగాయని, అతి చల్లని నీరు తాగడమే ఇందుకు కారణమని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధులకు గురయ్యే వారిలో ఎక్కువ మంది చిన్న

వి ల్ల లు ం టు న్నా రు .

ఆస్పత్రులకు వచ్చే ప్రతి నలుగురిలో ముగ్గురి పిల్లలు కూలింగ్ వాటర్ తాగి సమస్యలు కొని తెచ్చుకునే వారే. వీరంతా 14 ఏళ్లలోపు చిన్నారులే, వీటితో పాటు వేసవిలో వివిధ ఫ్లేవర్లలో లభించే ఐస్క్రీమ్లు తినడం వల్ల ఆరోగ్యం పాడవుతుంది. గొంతులోని పొరలు చల్లదనం బారిన పడి రోగ నిరోధక శక్తి కోల్పోతాయి. ఈ కారణంగా ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంది. గాలిలోని రైనో, ఎడినో, ఇన్ఫ్లూయింజాలాంటి బ్యాక్టీరి యాలు, వైరస్లు గొంతుపై ప్రభావం చూపి స్తాయి. జ్వరం రావడం, గొంతు మంట, బొంగురు పోవడం, వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. చల్లని నీళ్లు తాగితే దగ్గు కూడా వస్తుంది. గొంతు ఇన్ఫెక్షన్ల కారణంగా ఉపిరి తిత్తులపై ప్రభావం పడి న్యూమోనియా వచ్చే అవకాశం ఉంది. ఒళ్లు, కీళ్ల నొప్పుల సమస్య ఏర్పడుతుంది. గుండె, కిడ్నీలకు

రక్తనాళాలు బిగుసుకుపోతాయి

3-12 ఏళ్ల చిన్నారుల గొంతుల్లో టాన్సిల్స్, ఎడినాయిడ్ గ్రంధులు అతి త్వరంగా ఇన్‌ఫెక్షన్‌కు గురవుతుంటాయి. వీరిని చల్లని నీటికి దూరంగా ఉంచాలి. జ్వరం సమయంలో భోజనం చేసేందుకు గొంతు సహకరించదు. ఒక గ్లాస్ చల్లని నీళ్ల తాగగానే గొంతులోని రక్తనాళాలు బాగా బిగుసుకు పోతాయి. కొద్దిసేపటికి గొంతులోని రక్తనాళాలు ఉబ్బి గొంతు గోడలకుండే పొరలు దెబ్బతింటాయి. పిలలకు కాచి చల్లార్చిన నీళ్ల ఇవ్వాలి. ఫ్రిజ్‌నీరు, ఐస్క్రీములకు దూరంగా ఉంచాలి. పెరుగు, పండ్లు ఫ్రిజ్లో నుండి తీసిన వెంటనే కాకుండా కాసేపు ఉంచి తగిన ఉష్ణోగ్రతకు చేరాక తినాలి.



డాక్టర్ పచ్చవ విజేత, పిల్లల వైద్య నిపుణులు.

బరిలో ఉన్న అభ్యర్థులు వీరే...

గుంటూరు లోక్‌సభ పరిధిలో ఐదుగురు మహిళలు

తొలిసారిగా పోటీ చేస్తున్న ప్రధానపార్టీల అభ్యర్థులు 11 మంది

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అసెంబ్లీ,పార్లమెంటు ఎన్నికల్లో మొదటిసారి పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. టిడిపి, వైసిపి నుంచి పలువురు అభ్యర్థులు తొలిసారిగా ఎన్నికల బరిలోకి అడుగుపెట్టారు. వైసిపి నుంచి గుంటూరు తూర్పు, మంగళగిరి, ప్రత్తిపాడు, పొన్నూరు అభ్యర్థులు ఉన్నారు. టిడిపి నుంచి గుంటూరు పశ్చిమ, ప్రత్తిపాడు, పెదకూరపాడు అభ్యర్థులు తొలిసారిగా బరిలో నిలిచారు. మంగళగిరి నుంచి సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకర్, చిలకలూరి పేట వైసిపి అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు శాసనసభకు తొలి సారిపోటీ చేస్తున్నా ప్రస్తుతం ఆయన గుంటూరు మేయర్‌గా కొనసాగుతున్నారు. లోక్‌సభకు సంబంధించి గుంటూరు టిడిపి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, జంగాల అజయ్‌కుమార్ తొలిసారిగా పోటీ చేస్తున్నారు. తొలిసారిగా గుంటూరు జిల్లాలో ఐదుగురు మహిళలు పోటీ చేస్తున్నారు.వీరిలో నలుగురు వైసిపి నుంచి కాగా ఒకరు టిడిపి నుంచి ఉన్నారు.ప్రస్తుత ఎన్నికల్లో గుంటూరు జిల్లాలో 162 మంది, పల్నాడు జిల్లాలో 122 మంది పోటీ చేస్తున్నారు. టిడిపి, వైసిపి, కాంగ్రెస్, వామపక్షాలు, జనసేనతోపాటు పలు రిజిస్ట్రర్డ్ పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు దాదాపు 100 మంది వరకు ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు.



తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారు

పెదకూరపాడు : భాష్యం ప్రవీణ్
ప్రత్తిపాడు : బాలసాని కిరణ్ (వైసిపి) బి.రామాంజనేయులు (టిడిపి)
గుంటూరు పశ్చిమ : గల్లా మాధవి (టిడిపి)
గుంటూరు తూర్పు : నూరిఫాతిమా (వైసిపి)
మంగళగిరి : మురుగుడు లావణ్య (వైసిపి), .జొన్నా శివశంకర్ (సిపిఎం)
పొన్నూరు : అంబటి మురళీ కృష్ణ (వైసిపి)
వినుకొండ : చెన్నా శ్రీనివాసరావు (జనసేన)

లోక్‌సభ అభ్యర్థులు

గుంటూరు : పెమ్మసాని చంద్రశేఖర్ (టిడిపి),జంగాల అజయ్‌కుమార్ (సిపిఐ)



షేక్ మస్తాన్ వలి (కాంగ్రెస్‌పార్టీ) గుంటూరు తూర్పు | నూరి ఫాతిమా (వైసిపి) గుంటూరు తూర్పు | నసీర్ అహ్మద్ (టిడిపి) గుంటూరు తూర్పు



రాచకొండ జాన్‌బాబు (కాంగ్రెస్) గుంటూరు పశ్చిమ | విడదల రజిని (వైసిపి) గుంటూరు పశ్చిమ | గల్లా మాధవి (టిడిపి) గుంటూరు పశ్చిమ



జొన్నా శివశంకరరావు (సిపిఎం) మంగళగిరి | మురుగుడు లావణ్య (వైసిపి) మంగళగిరి | నారా లోకేష్ (టిడిపి) మంగళగిరి



సుశీల్ రాజ్ (కాంగ్రెస్) తాడికొండ | మేకతోటి సుచరిత (వైసిపి) తాడికొండ | తెనాలి శ్రావణ్‌కుమార్ (టిడిపి) తాడికొండ



శావల గోపాల్ సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ - తెనాలి | అన్నాబత్తుని శివకుమార్ (వైసిపి) తెనాలి | నాదెండ్ల మనోహర్ (జనసేన) తెనాలి



జక్కా రవీంద్రనాథ్ (కాంగ్రెస్) పొన్నూరు | అంబటి మురళీకృష్ణ (వైసిపి) పొన్నూరు | ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ (టిడిపి) పొన్నూరు



కొరివి వినయ్ కుమార్ (కాంగ్రెస్) ప్రత్తిపాడు | బలసాని కిరణ్ కుమార్ (వైసిపి) ప్రత్తిపాడు | బూర్ల రామాంజనేయులు (టిడిపి) ప్రత్తిపాడు



జంగాల అజయ్‌కుమార్ (సిపిఐ)
గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి



కిలారి వెంకట రోశయ్య (వైసిపి)
గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి



డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ (టిడిపి)
గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి



అలెగ్జాండర్ సుధాకర్ (కాంగ్రెస్)
నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి



అనిల్‌కుమార్ యాదవ్ (వైసిపి)
నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి



లావు శ్రీకృష్ణదేవరాయులు (టిడిపి)
నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి



షేక్ మహబూబ్ బాషా (కాంగ్రెస్) నరసరావుపేట | డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి (వైసిపి) నరసరావుపేట | డాక్టర్ చదలవాడ అరవిందబాబు (టిడిపి) నరసరావుపేట



మద్దుల రాధాకృష్ణ (కాంగ్రెస్) చిలకలూరిపేట | కావటి శివనాగ మనోహర్ నాయుడు (వైసిపి) చిలకలూరిపేట | ప్రత్తిపాటి పుల్లారావు (టిడిపి) చిలకలూరిపేట



చెన్నా శ్రీనివాసరావు (కాంగ్రెస్) వినుకొండ | బొల్లా బ్రహ్మనాయుడు (వైసిపి) వినుకొండ | జివి ఆంజనేయులు (టిడిపి) వినుకొండ



వై .రామ చంద్రారెడ్డి (కాంగ్రెస్) మాచర్ల | పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (వైసిపి) మాచర్ల | జూలకంటి బ్రహ్మనందరెడ్డి (టిడిపి) మాచర్ల



తియ్యగూర ఎలమందారెడ్డి (కాంగ్రెస్) గురజాల | కాసు మహేష్ రెడ్డి (వైసిపి) గురజాల | యరపతినేని శ్రీనివాసరావు (టిడిపి) గురజాల



చుక్కా చంద్రపాల్ (కాంగ్రెస్) సత్తెనపల్లి | అంబటి రాంబాబు (వైసిపి) సత్తెనపల్లి | కన్నా లక్ష్మీనారాయణ (టిడిపి) సత్తెనపల్లి



పమిడి నాగేశ్వరరావు (కాంగ్రెస్) పెదకూరపాడు | నంబూరు శంకరరావు (వైసిపి) పెదకూరపాడు | భాష్యం ప్రవీణ్ (టిడిపి) పెదకూరపాడు



వైసిపి కార్యకర్తలపై దాడి

రెండు కార్లు ధ్వంసం - రెంటచింతలలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - రెంటచింతల

సమస్యాత్మక నియోజకవర్గమైన మాచర్ల పరిధిలోని రెంటచింతలలో పోలింగ్‌కు ముందురోజైన ఆదివారమే ఉద్రిక్తత నెలకొంది. పోలింగ్ కేంద్రాల్లో ఆయా పార్టీల తరుపున కూర్చునే ఏజెంట్ల విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు వివాదం వచ్చింది. ఇదికాస్త సాయంత్రానికి ఘర్షణకు దారితీసింది. టిడిపికి చెందిన వారు వైసిపి వారిపై కర్రలతో దాడి చేశారు. దాడిలో మోర్తుల ఉమామహేశ్వర్‌రెడ్డి, పొట్లూరి వెంకట్‌రెడ్డి గాయపడ్డారు. దాడిలో రెండు కార్లు సైతం ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న కారంపూడి సిఐ నారాయణస్వామి అక్కడికి చేరుకుని ఇరు పక్షాలను చెదరగొట్టారు. విషయం తెలుసుకున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రెంటచింతలకు వచ్చి క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం వారిరి చికిత్స నిమిత్తం నరసరావుపేటకు తరలించారు. దీనిపై ఇరుపక్షాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదయ్యాయి.



ఓటేయడానికి వచ్చి.. బస్సుల్లేక ఎండకు చిక్కి..

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆర్టీసీ బస్సులు ఎన్నికల విధులుకు వెళ్లటంతో ప్రయాణికులు సరిపడా సర్వీసుల్లేక ఇబ్బందులు పడ్డారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఓటు హక్కు ఉన్నవారు, ఉద్యోగం, ఇతర ఉపాధి కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లారు. వారంతా ప్రస్తుతం ఓటేసేందుకు సొంతూళ్లకు పయనమయ్యారు. ప్రైవేటు వాహనాల్లో ఎలాగోలా సత్తెనపల్లి వరకూ వచ్చినా ఇక్కడి నుండి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు వెళ్లడానికి మాత్రం బస్సుల సదుపాయం లేక ఎండలో పిల్లాపాపలతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. చివరికి అధిక ఛార్జీలు చెల్లించి మళ్లీ ప్రైవేటు వాహనాల్లోనే సొంతూళ్లకు వెళ్లారు.

తొలుత వికలాంగునికీ విధులు..

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

నర్సరావుపేట రూరల్ మండలం సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా పని చేస్తున్న డి.రామకృష్ణకు ఎన్నికల విధులు కేటాయించారు. సత్తెనపల్లి మండలం కోమెరపూడిలో ఓపిఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే చివర్లో రిజర్వు సిబ్బందిని ఆ స్థానంలో నియమించి రామకృష్ణకు విధుల నుండి ఉపశమనం కల్పించారు.





నరసరావుపేటలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్



మాచర్ల పట్టణంలోని ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్

పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, సామగ్రి

నేడు సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం - పలుచోట్ల సిబ్బంది అవస్థలు



స్ట్రాంగ్ రూమ్ ప్రధాన ద్వారం వద్ద సిసి కెమెరాను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనున్న నేపథ్యంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని పల్నాడు రోడ్డులో ఉన్న ఎస్ఎస్ఎన్ కాలేజీలో భద్రపరిచిన ఎన్నికల సామగ్రి పంపిణీని పల్నాడు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం ప్రారంభించారు. జిల్లాలో ప్రశాంత పోలింగ్‌కు ఏర్పాట్లన్నీ చేశామన్నారు. నరసరావుపేట నియోజకవర్గ పరిధిలో 2 లక్షల 30 వేల 572 మంది ఓటర్లున్నారని, వీరు ఓటేయడానికి 245 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెపాపరు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా 1929 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా 10,800 మందిని బైండోవర్ చేశామని, ఇప్పటి వరకు రూ.5.09 కోట్ల నగదు, మద్యం, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటిల్లో ఆధారాలు చూపిన వాటిని తిరిగి ఇచ్చేస్తామన్నారు. పోలింగ్ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి పి.సరోజిని, నోడల్ అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

పోలింగ్ సరళిపై నిత్యం పరిశీలన..

పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అందులో వెబ్ కాస్టింగ్ మానిటరింగ్, డిస్టిక్ కమాండ్ కంట్రోల్ రూము, కమ్యూనికేషన్ అండ్ మానిటరింగ్ కంట్రోల్ రూమ్, మీడియా మానిటరింగ్ రూములు ఉన్నాయని జిల్లా ఎన్నికలాధికారి తెలిపారు.

స్ట్రాంగ్ రూముల పరిశీలన

పోలింగ్ అనంతరం ఇవిఎంలను భద్రపరిచేందుకు నరసరావుపేట మండలంలోని కాకాని గ్రామ పంచాయతీ పరిధిలోగల జెఎన్‌టియు కళాశాలలో స్ట్రాంగ్ రూములను జిల్లా ఎన్నికలాధికారి శివశంకర్ ఆదివారం పరిశీలించారు. పటిష్ట బందోబస్తు నిర్వహించాలని, ఈవీఎం బాక్సలను సిసి కెమెరాల నిఘాలో భద్రపరచాలని సూచించారు. ఓట్ల లెక్కింపు ముగిసే వరకు స్ట్రాంగ్ రూములు పరిసర ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు ప్రవేశం నిషేధమన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో మెటీరియల్ మేనేజ్మెంట్ నోడల్ ఆఫీసర్ శ్రీదేవి పాల్గొన్నారు.

నీటికి కటకట.. కూర్చోలేక అవస్థ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు సామగ్రి పంపిణీ కేంద్రాన్ని గణపవరంలోని సిఆర్ కాలేజీలో ఏర్పాటు చేశారు. 2300 మంది పోలింగ్ సిబ్బంది రాగా అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయలేదు. ఆరు టెంట్లు అవసరమైన చోట రెండు టెంట్లు వేశారు. వెయ్యిలోపే కుర్చీలు తెప్పించారు. తాగునీరు కూడా సరిగా సమకూర్చలేదు. ఐదారు వందల బాటిల్స్ మాత్రమే తీసుకొచ్చారు. వాటిని కూడా భోజన సమయంలోనే ఇచ్చారు.మహిళా సిబ్బందికి మరుగుదొడ్ల వసతి కూడా ఏర్పాటు చేయలేదని వారు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. కూర్చోవడానికి కుర్చీలైనా లేకపోవడంతో చాలా మంది చెట్ల కింద, డ్రెయినేజీ కాల్వ అరుగుల మీద కూర్చోవాల్సి వచ్చింది.

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల నియోజకవర్గంలోని 299 పోలింగ్ కేంద్రాలకు డిస్టిబ్యూషన్ కేంద్రాల నుండి పోలింగ్ అధికారులు ఈవీఎం బాక్సలతో ఆదివారం తరలివెళ్లారు. స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి ఆదివారం ఉదయానికే చేరుకున్న అధికారులు తమ తమ పోలింగ్ కేంద్రాలకు సంబధించిన ఎన్నికల ఈవీఎంలతో పాటు మెటీరియల్ తీసుకొని ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన వాహనాల్లో ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. మాచర్ల నియోకవర్గంలో మొత్తం 28 సెక్టార్లు, 28 రూట్లుగా విభజించారు. సుమారు 2 వేల మంది అధికారులు సిబ్బంది ఈ ఎన్నికల్లో విధినిర్వహణలో పాల్గొంటున్నట్లు మాచర్ల ఆర్వో శ్యాంప్రసాద్ తెలిపారు. పోలింగ్ కేంద్రలో ఏర్పాట్లను, డిస్టిబ్యూషన్‌ను ఆయన దగ్గరవుండి పరిశీలించారు.

రక్షణ వలయంలో మాచర్ల నియోజకవర్గం

రాష్ట్రంలో అతి సమస్యాత్మక నియోజకవర్గం కావటంతో మాచర్లలో పోలీస్ బలగాలతో అత్యంత పటిష్టమైన భద్రత మధ్య పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు గురజాల డీఎస్పీ పల్లంరాజు తెలిపారు. రాష్ట్రస్థాయి అధికారులు కూడా ఈ నియోజకవర్గంలో పర్యవేక్షణకు వచ్చారన్నారు. ఐజి శ్రీకాంత్, ఎస్పీ సుప్రజ, ముగ్గురు డీఎస్పీలు, ఏడుగురు సిఐలతోపాటు మరికొంతమంది రానున్నారని తెలిపారు. 20 మంది ఎస్సైలు, 300కు పైగా హెడ్ కానిస్టేబుల్స్, పోలీస్ కానిస్టేబుల్స్, 4 కంపెనీలు (400 మంది) సెంట్రల్ ఆర్మడ్ పోలీస్ ఫోర్స్, వీరుకాక తమిళనాడు నుంచి మరికొంత సిబ్బంది వస్తున్నారని, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రియాక్షన్ టీమ్స్‌తో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, అనవసరమైన వివాదాల్లో పాల్గొని, కేసుల్లో ఇరుక్కోని జీవితాలు నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు పెదకూరపాడు నియోజకవర్గ ఈఆర్ఓ ప్రభాకర్‌రావు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బారికేడ్లు, షామియానాలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, ఇతర వసతులు ఏర్పాటు చేశామన్నారు. ఉదయాన్నే ఐదున్నరకు మాక్ పోలింగ్ జరుగుతుందని, 7 గంటల నుండి జనరల్ ఓటింగ్ మొదలవుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని సూచించారు.

స్త్రీ,పురుషులకు ఒకే లైన్

ఇదిలా ఉండగా మహిళలకు పురుషులకు ఒకే క్యూ లైన్ ఏర్పాటు చేయటం విమర్శలకు తావిస్తోంది. గత ఎన్నికల్లో మహిళలకు ఒక వరుస, పురుషులకు ఒక వరుస ఏర్పాటు చేశారు. ప్రస్తుతం బారికేడ్లు ఏర్పాటు చేసి ఒకేలైను ఏర్పాటు చేశారు.



పెదకూరపాడులో ఒకే క్యూ ఉన్న కేంద్రం



గణపవరం సిఆర్ కాలేజీలో సిబ్బంది అవస్థ



మాచర్ల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఆర్వో శ్యాంప్రసాద్

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

- నియోజకవర్గంలో 273 పోలింగ్ స్టేషన్లు
- జెఎంజె కళాశాల్లో పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ పంపిణీ
- ఆర్వో ప్రఖర్‌జైన్ సారధ్యంలో ఏర్పాట్లు
- డీఎస్పీ రమేష్ సారధ్యంలో పటిష్టమైన బందోబస్తు

ప్రజాశక్తి-తెనాలి

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. రిటర్నింగ్ అధికారి ప్రఖర్ జైన్ నేతృత్వంలో పటిష్టంగా ఏర్పాట్లు చేశారు. స్థానిక జెఎంజె మహిళా కళాశాల్లో ఎన్నికల సిబ్బందికి మెటీరియల్, ఈవిఎంల పంపిణీ జరిగింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌కు చేరుకోవటం కనిపించింది. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, అదర్ పోలింగ్ ఆపీసర్స్‌తో కూడిన ఆరుగురు బృందాన్ని అధికారులు కేటాయించారు. డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్ద పెద్దపెద్ద టెంట్లు ఏర్పాటు చేశారు. వేసవి తీవ్రతకు ఇబ్బంది లేకుండా కూలర్లు ఏర్పాటు చేశారు. త్రాగునీరు, మొబైల్ టాయిలెట్స్ అందుబాటులో ఉంచారు. ఎన్నికల సిబ్బందికి ఉదయం టిఫిన్‌తో పాటు మద్యాహ్నం భోజన సౌకర్యాన్ని కూడా కల్పించారు. నియోజకవర్గంలో ఉన్న తెనాలి, కొల్లిపర మండలాలకు సంబంధించి 273 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు అందుకు తగిన రీతిలో సిబ్బందిని కేటాయించి, వారిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఆర్టీసి బస్సులతో పాటు, ప్రైవేటు వాహనాలను ఉపయోగించారు.

పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాం

పఖర్‌జైన్, రిటర్నింగ్ అధికారి, తెనాలి

నియోజకవర్గంలో మొత్తం 273 పోలింగ్ కేంద్రాలున్నాయి. వాటిలో 40 సమస్యాత్మకంగా గురించాం.అక్కడ ప్రత్యేక భద్రత కల్పించాం. 208 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశాం. పోలింగ్ స్టేషన్‌కు బయట, లోపల కూడా పోలింగ్ ప్రక్రియ రికార్డ్ అవుతుంది. వెబ్ కాస్టింగ్ జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి, ఎన్నికల కమిషన్ వీక్షించే విదంగా ఉంటుంది. ఓటర్లు ఉదయం 7 గుంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. పోలింగ్ సిబ్బందికి కూడా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాం. ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు ప్రజలు సహకరించాలి. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగంచుకోవాలి. అలాగే నియోజకవర్గంలో హెూంఓటింగ్ ద్వారా 345మంది, ఎసెన్షియల్ సర్వీసెస్‌కు సంబంధించి 209 మంది, ఎన్నికల సిబ్బంది 1974, సర్వీస్ ఓట్స్ ఐదు, మొత్తం 2533 పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు.



పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్వో ప్రఖర్ జైన్



విధులకు హాజరైన పోలీసు సిబ్బంది



పోలీసు సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న డీఎస్పీ రమేష్

పటిష్టమైన బందోబస్తు

ఎం.రమేష్, డీఎస్పీ, తెనాలి

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగంచుకునేందుకు పటష్టమైన ఏర్పాట్లు చేశాం. 284మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశాం. ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. నిబంధనల మేరకు పోలింగ్ బూత్‌కు 100 మీటర్ల పరిధిలో ఎలాంటి వాహనాల పార్కింగ్ చేయకూడదు. ఆ పరిధిలో మొబైల్ ఫోన్ కూడా ఉపయోగించకూడదు. పోలింగ్ స్టేషన్లకు సమీపంలోని నివాసాల్లో, అపార్ట్ మెంట్లలోకి స్థానికేతరులను అనుమతించవద్దని కోరాం. నోటీసులు కూడా జారీ చేశాం. అలాంటివి గుర్తిస్తే ఓనర్లపై చర్యలు తప్పవు. లాడ్జిల్లోనూ చెకింగ్ ఉంది. మొబైల్ పార్టీలు కూడా బందోబస్తులో ఉంటాయి. ఏపి పోలీస్‌తో పాటు టిఎస్ పోలీస్, సిఐఎస్ఎఫ్ బలగాలు మొహరించాయి. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సిసి కెమేరాలు ఉన్నాయి. ఎలాంటి ఘటన జరిగినా పోలీస్ అప్రమత్తమౌతుంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు మూడు వాహనాలకు మాత్రమే ఆర్వో అనుమతిచ్చారు. ఒక వాహనంలో అభ్యర్థి, రెండో వాహనంలో చీఫ్ ఏజంట్, అభ్యర్థికి సంబందించి మూడో వాహనం ఉంటుంది. అభ్యర్థి మాత్రమే పోలింగ్ స్టేషన్‌లోకి అనుమతిస్తారు. అయితే బూత్ వద్ద ప్రచారాలు నిషేదం. నిబంధనలకు విరుద్దంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు.





ఈవిఎం బాక్సులతో సిబ్బంది, మెటీరియల్‌ను సరిచూసుకుంటున్న పోలింగ్ సిబ్బంది

సందడి చేస్తున్న సర్వేశ్వరరావులు

ప్రజాశక్తి - తుళ్లూరు

ఇంటిలో, వీధిలో.. అన్ని చోట్లా 'సర్వే' శ్వరరావులు దర్శనమిస్తున్నారు.పక్కన వినే వాడు ఒక్కడు ఉన్నా చాలు..ఫలానా పార్టీకి ఇన్ని సీట్లు.. ఫలానా అభ్యర్థికి ఇంత మెజార్టీ వస్తుందంటూ ఊదర గొట్టేస్తున్నారు. పార్టీల గెలుపు ఓటమి లపై జోస్యం చెపుతున్నారు.వేరే జిల్లాలో మా బంధువులు ఉంటే మాట్లాడాను..నా ఫ్రెండ్స్ ని ఆరా తీశాను..అంటూ తూర్పున సూర్యుడు ఉదయించడం ఎంత నిజమో తన సర్వే కూడా అంతే నిజమని,మీరు కూడా నమ్మండి అంటూ సర్వేశ్వరరావులు చేస్తున్న సందడి అంతా ఇంతా కాదు. ఏంటి పరిస్థితి..? అని అడగడమే ఆలస్యం గొంతు సవరించుకొని రాష్ట్రం లోని అన్ని రాజకీయ పార్టీలకు వచ్చే సీట్ల సంఖ్య, వాటి భవిష్యత్ గురించి చెప్పేస్తున్నారు. పొత్తుల వల్ల ఫలానా పార్టీకి కొన్ని కులాలు,మతాల వాళ్ళు దూరమవుతారని,దీంతో సదరు పార్టీకి కొంత మేర నష్టం వాటిల్లుతుందని చెప్పడంతో పాటు జిల్లాల వారీగా ఏపార్టీ ఎక్కడ బలంగా ఉందో,బలహీనంగా ఉందో నమ్మబలుకు తున్నారు.తాను గెలుస్తుందని చెప్పిన పార్టీ ఖచ్చితంగా విజయం సాధిస్తుందని, ఇంతకు ముందు తాను చెప్పిన విధంగానే జరిగిందని దబాయిస్తున్నారు. మేము ఎన్ని ఎలక్షన్లు చూడలేదు..అని చిద్విలాసంగా నవ్వుతున్నారు. జనాలకి కూడా ఇలాంటివి మామూలయి పోయాయి.మాకు చెప్పవద్దు..మేము వినం..అని అనడం లేదు.ప్రస్తుతం ఎన్నికల తరుణం కావడంతో ఎవరు ఏది చెప్పినా వింటున్నారు.ఎన్నికల ఫలితాలు వెల్లడి కావడానికి చాలా సమయం ఉండడంతో సర్వేశ్వర రావుల నోరు ఇప్పట్లో మూతపడే అవకాశం లేదు.

నేటి పోలింగునకు పకడ్బందీగా ఏర్పాట్లు

నియోజకవర్గంలో 2 లక్షల 93 వేల 432 మంది ఓటర్లు - 300 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - మంగళగిరి :మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం 87 సోమవారం జరిగే పోలింగ్‌నకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని మంగళగిరి అసెంబ్లీ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి జి రాజకుమారి తెలిపారు. ఆదివారం మంగళగిరిలోని నిర్మల హైస్కూల్‌లో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది ఎన్నికల సామాగ్రితో ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రాజకుమారి మీడియాతో మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గం లో 2,92,432 మంది ఓటర్లు ఉన్నారని వీరి కోసం మొత్తం 300 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సుమారు 3000 వేల మంది సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తు న్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ కు ఒక పోలింగ్ అధికారి ,ఒక సహాయ పోలింగ్ అధికారి, మరో నలుగురు సిబ్బంది తోపాటు పోలీసులు విధులు నిర్వహిస్తారు. వీరితోపాటు ఒక వీడియో గ్రాఫర్ , ఒక సూక్ష్మ పరిశీలకులు ఉంటారని ఆమె తెలిపారు. నియోజక వర్గంలో ఏర్పాటుచేసిన 300 పోలింగ్ కేంద్రాలలో 53 సమస్యాత్మక కేంద్రాలు, 25 అతి సమస్య యాత్మక పోలిక్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. ప్రత్యేకంగా 53 పోలింగ్ కేంద్రాలకు ఆర్మీ పహారా ఏర్పాటు చేయడం జరిగిందని రాజకుమారి తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం ప్రత్యేక మహిళా మోడలింగ్ పోలింగ్ కేంద్రం ఒకటి, యువత పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంకాల 6 గంటలకు ముగిస్తుంది అన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి రాజకుమారి ఓటరు విజ్ఞప్తి చేశారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు మొబైల్ ఫోన్లు తీసుకురాకూడదు. కేవలం పోలింగ్ ఆఫీసర్, సూక్ష్మ పరిశీలకులు మాత్రమే వారు కూడా సైలెంట్లో పెట్టుకోవాలి. మరి ఇతరుల దగ్గర మొబైల్ ఫోన్ ఉండకూడదన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం ఎంత నమోదయింది తెలియజేయడం జరుగుతుందన్నారు. వేసవిని దష్టిలో పెట్టుకొని ఓటర్లకు ఎలాంటి సౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాటు చేశామని రాజకుమారి మీడియాకు తెలియజేశారు. ఈ మీడియా సమావేశంలో మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ డిఎస్ పి రవికాంత్ మంగళగిరి పట్టణ, రూరల్ సీఐలు ఎం శ్రీనివాసరావు, వెంకట్రావు, ఎస్సైలు లు పాల్గొన్నారు.





మీడియాతో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి రాజకుమారి

ఓటు హక్కు వినియోగించుకునే నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీలోనీ పోలింగ్ కేంద్రంలో, టిడిపి అధినేత చంద్రబాబు, నారా లోకేష్, వారి కుటుంబ సభ్యులు ఉండవల్లిలోని పోలింగ్ కేంద్రంలో, సిపింఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు సోమవారం ఓటు వేయనున్నారు.





చిత్తచిత్తడిగా పోలింగ్ కేంద్రాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లిలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి పోలింగ్ బూత్‌లన్నీ బురదతో చిత్తడిచిత్తడిగా మారాయి. పట్టణంలో మొత్తం 49 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. తాడేపల్లి సెంటర్‌తో పాటు సుందరయ్యనగర్, కృష్ణనగర్ ప్రాంతాల్లో వర్షం కురవడంతో పోలింగ్ బూత్‌ల ముందు నీరు నిలిచిపోయింది. పోలింగ్ బూత్‌ల ముందు బురదమయంగా మారడంతో ఆదివారం మధ్యాహ్నం విధులకు వచ్చిన పోలింగ్ సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ జరిగే సోమవారం కూడా ఏ కొద్దిపాటి వర్షం పడినా పోలింగ్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారనుంది.

పోలీస్‌స్టేషన్ సమీపంలోనే పంపకాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలోనే యథేచ్ఛగా ఓటర్లను రెండు ప్రధాన రాజకీయ పార్టీలు కొనుగోలు చేస్తున్నాయి. ఓ పార్టీ కార్యాలయం దగ్గర అయితే సందడి నెలకొంది. రెండు ప్రధాన పార్టీలు తమకు ఓటు వేస్తారు అనుకున్న వారికే డబ్బులు పంపిణీ చేయడంతో డబ్బులు అందని వారు తిట్ల దండకం మొదలుపెడుతున్నారు. రోడ్ల మీదే పెద్దగా కేకలు వేస్తూ అరుపులు కేకలతో ఆ ప్రాంతమంతా తిరుగుతున్నారు. పైసలు అందని వారు తమకు ఎందుకు డబ్బుల ఇవ్వరని ప్రశ్నిస్తున్నారు. దాడి చేసినంత పని చేశారు. సిసి కెమెరాలు పెట్టుకున్న ప్రత్యేక ఫ్లైయింగ్ స్క్వాడ్ వాహనాలకు వంద గజాల దూరంలోనే యథేచ్ఛగా డబ్బుల పంపిణీ జరిగింది. డబ్బుల పంపిణీని అరికట్టాల్సిన అధికారులు కూడా తమకేమీ తెలియదన్నట్లు మిన్నకుండిపోయారు. పోలింగ్ జరిగే గంట ముందు కూడా డబ్బులు పంపిణీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఓటుకు రూ.రెండు, మూడు వేలు

ఆదివారం రాత్రి మొత్తం సాగిన ప్రలోభాలు

ఏరులై పారిన మద్యం.. డబ్బు ప్రవాహం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

శుక్రవారం సాయంత్రంతో సార్వత్రిక ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత ఆయా రాజకీయ పార్టీల నేతలు శుక్రవారం రాత్రి నుండి ఓటర్లను ప్రలోభపెట్టే పనిలో నిమగ్నమయ్యారు. బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా గెలుపుకోసం ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంలో వ్యూహాలు రచించి అమలు చేస్తున్నారు. అందులో భాగంగా మద్యం, నగదు పంపిణీలో పార్టీల నాయకులు మునిగిపోయారు. ఏది ఏమైనా గెలువాలనే ధీమాతో ఆయా పార్టీల నాయకులు, అభ్యర్థుల అనుచరులు అవకాశం దొరికిన చోట ప్రలాభోలకు గురిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి నుండే ఆయా పార్టీల నాయకులు ఆయా నియోజకవర్గంలోని గ్రామాలలో ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీ చేశారు. ఓటర్లు సైతం డబ్బు పంపిణీకి అలవాటు పడి అర్ధరాత్రి, సోమవారం తెల్లవారు జాము వరకు నాయకుల ఇంటి ముందే పడిగాపులు కాయడం గమనార్హం. ఒక్కో ఓటుకు రూ 2 వేల నుండి రూ 3 వేలు వరకు పంపిణీ చేస్తున్నట్లు ఓటర్లే బహిరంగంగా చెబుతున్నారు. నేతలు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యాన్ని ఏరులుగా డబ్బు ప్రవాహన్ని కొనసాగించి ఓట్లు కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

సత్తెనపల్లి నియోజకవర్గంలో
2,42,047 మంది ఓటర్లు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సత్తెన పల్లి అసెంబ్లీ ఎన్నికలు నేడు జరుగ నున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు 15 మంది పోటీలో ఉన్నారు. వైసిపి అభ్యర్థి అంబటి రాంబాబు, టిడిపి-జనసేన-బిజెపి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, ఇండియా వేదిక బల పరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చుక్కా చంద్రపాల్ పోటీలో ఉన్నారు. నియోజక వర్గంలో ఉన్న 274 పోలింగ్ కేంద్రాల్లో 2,42,047 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. సత్తెన పల్లి మండలంలో 61,692, సత్తెనపల్లి పట్టణంలో 47,915, రాజుపాలెం మండ లంలో 42,483 నకరికల్లు 54,185, ముప్పాళ్ళలో 35,772 మంది ఓటర్లు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. నియోజకవర్గంలో పురుషులు కన్నా మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. 1,18,400మంది పురుష ఓటర్లు ఉండగా 1,23,635 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 5,235 మంది మహిళా ఓటర్లు ఉన్నారు వీరే కీలకం కానున్నారు.



ప్రత్యామ్నాయ రాజకీయ సంస్కృతితోనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది

ప్రొఫెసర్ వార్డ్ బైరన్ స్కాట్

ప్రజాశక్తి-గుంటూరు: భారతదేశంలో ప్రత్యామ్నాయ రాజ కీయ సంస్కృతిని ప్రోత్సహించడం ద్వారానే భారతీయ ప్రజా స్వామ్యం వర్ధిల్లు తుందని ప్రపంచ ప్రఖ్యాతగాంచిన ప్రముఖ రాజనీతి, మానవీయ శాస్త్ర ప్రొఫెసర్ వార్డ్ బైరన్ స్కాట్ పేర్కొన్నారు. నెదర్లాండ్‌కు చెందిన అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన యూనివర్సిటీ ఆఫ్ ఆమస్టేర్ లో ప్రొఫెసర్ గా పని చేస్తూ ఇండియా,ఇండోనేషియాలో ఎన్నికల తీరును పరి శీలిస్తూ ఈ నెల 11వ తేదీన రాత్రి గుంటూరు లోని జన చైతన్య వేదిక కార్యాలయాన్ని ప్రొఫెసర్ వార్డ్ బైరన్ స్కాట్ సందర్శించి పలు పౌర సంస్థల ప్రతినిధులతో చర్చించారు. వీరితోపాటు కింగ్స్ కాలేజీ లండన్‌కు చెందిన ప్రొఫెసర్ విగ్నేష్ కార్తీక్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ కు చెందిన పూర్వ ప్రొఫెసర్ కొండవీటి చిన్నయ్య సూరి భారతీయ ఎన్ని కల తీరుతెన్నులపై చర్చించారు. ఈ సందర్భంగా వార్డ్ బైరన్ స్కాట్ ప్రసంగిస్తూ ప్రపంచంలో ఎన్నికలలో డబ్బు పాత్ర బలంగా ఉన్న దేశాలు అభివృద్ధి చెందలేకపోయాయని, ఇదే పరిస్థితి భారతదేశంలో ఉత్పన్నమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు,మద్యం,కుల మతాల ప్రలోభాలకు లోను కాకుండా ప్రజలను చైతన్యవంతులను చేసే బాధ్యత బలమైన పౌర సంస్థలు, మేధావులు తీసుకోవాలన్నారు. తక్షణం రాజ కీయ, ఎన్నికల సంస్కరణలకు రాజకీయ పార్టీలు పూనుకోవా లని అన్నారు. ప్రొఫెసర్ విగ్నేష్ కార్తీక్ మాట్లాడుతూ రాజ కీయ పార్టీలకు ఎన్నికల నిధులు ప్రజల నుండి సేకరించాలని ప్రభుత్వాలు కూడా కొంతమేరకు నిధులు ఇవ్వడం ద్వారానే రాజకీయ కార్పోరేటీకరణను నివారించవచ్చని అన్నారు. ఎన్నికలలో డబ్బు ప్రభావం తగ్గటానికి ఓటర్లలో నైతిక బలం పెరగాలన్నారు. ప్రముఖ రాజనీతి శాస్త్ర ప్రొఫెసర్ కొండవీటి చిన్నయ్య సూరి ప్రసంగిస్తూ ప్రాంతీయ పార్టీలు కుటుంబ పార్టీలుగా మారుతూ వ్యక్తి కేంద్రంగా రాజకీయాలు నడపడం ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతుందన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో ఎన్నికల బరిలో కేవలం వెయ్యి కుటుంబాలు మాత్రమే పోటీ పడుతున్నాయని అన్నారు. సేవా తత్పరులు , మేధావులు,ప్రజల సమస్యలపై అవగాహన ఉన్న చైతన్య వం తులైన వ్యక్తులు ఎన్నికల్లో పోటీ పడలేకపోతున్నారని ఆవే దన వ్యక్తం చేశారు. చర్చా గోష్ఠి లో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రత్యూష సుబ్బారావు, మానవత సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, రేట్ పేయిర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓ .నారాయణరెడ్డి ,ఆమ్ ఆద్మీ నేత శివప్రసాద్, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ నేత కోట రమేష్ ,తెలుగు భాషోద్యమ సంస్థ కన్వీనర్ డాక్టర్ వి రంగారావు, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ చిల్లర శంకర్ ప్రసంగించారు.


వినుకొండలో


సత్తెనపల్లిలో

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పోలీసు బలగాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గణపవరం శ్రీ చుండి రంగనాయకులు ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల విధుల్లో పాల్గొననున్న సిబ్బందికి ఎన్నికల సామగ్రిని ఆదివారం సాయంత్రానికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని చిలకలూరిపేట ఎన్నికల అధికారి నారదముని, ఎఇఆర్వోలు జ్వాలా నరసింహం, అప్షి పున్ని సాబేగం, గోవిందంరావు, జన రల్ అబ్జర్వర్ షామణిపాండే, నరసరావు పేట డిఎస్పీ వర్మ పర్యవేక్షించారు. చిలకలూరి పేట నియోజకవర్గ పరిధిలో 239 పోలింగ్ కేంద్రాలతో పాటూ మరో రెండు యాగ్జిలరీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పట్టణ పరిధిలో 136వ కేంద్రం, 163వ కేంద్రంలో 1500లకు పైగా ఓటర్లు దాటిన మీదట, ఈ రెండు కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రానికి ఐదుగురు చొప్పున సిబ్బందిని కేటాయించారు. ఆర్టీసీ బస్సు ద్వారా పోలీసుల భద్రత నడుమ సామాగ్రి కేంద్రాలకు తర లించారు. ఈ సందర్భంగా ఆర్వో నారదముని మాట్లాడుతూ, చిలకలూరి పేట నియోజకవర్గ పరిధిలో 32 కేంద్రాలను క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని, నిఘా కెమెరాల సంఖ్య 139 నుండి 185 వరకూ పెంచినట్లు తెలిపారు. 1 నుండి 57 వరకూ నాదెండ్ల, 58 నుండి 114 వరకూ యడ్లపాడు, 115 నుండి 241 కేంద్రాలకు పట్టణ, రూరల్ పరిధిలో ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తున్నట్లు డిఎస్పీ తెలిపారు. మూడు మండలాలతో పాటు పట్టణ పరిధిలో జనరల్ పోలీసులతో పాటూ పారా మిలటరీ బలగాలను రంగంలోకి దించారు. చిలకలూరిపేట రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డి, అర్బన్ సిఐ రమేష్, మూడు మండలాల ఎస్సైలు పర్యవేక్షిస్తున్నారు.


చిలకలూరిపేటలో పోలింగ్ కేంద్రం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణంలో ఎన్నికలకు మొత్తం 72 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో 12 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గా గుర్తించామని అర్బన్ సిఐ పి.రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు పోలీస్ బలగాలను నియమించామని, సిసి కెమెరాలు, ఇతర జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. సెక్షన్ 144 అమల్లో ఉందని ఎన్నికలు జరిగే సమయంలో ఓటు వేసే వారిని ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని అ వివరించారు. పోలింగ్ ఆఫీసర్లకు, ఓటర్లకు సహకరించాలని ప్రజలను కోరారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఎన్నికల సిబ్బందికి ఎన్నికల అధికారులు ఆదివారం ఎన్నికల సామాగ్రి పంపిణీ చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ స్కూల్లో ఎన్నికల అధికారులు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్ లు, దరఖాస్తు ఫారాలు తదితర సామాగ్రిని సిబ్బందికి అందజేశారు. ఉదయం 10 గంటలకు ఎన్నికల సిబ్బంది పంపిణీ కేంద్రానికి చేరుకున్నారు. నియోజకవర్గంలో అసెంబ్లీ, పార్లమెంటు కు ఒకే సారి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి విడి విడిగా ఈవీఎంలు, వీవీ ప్యాట్ యంత్రాలు పం పిణీ చేశారు. 274 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2024 మంది ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సెక్టార్ వారిగా సిబ్బంది నియమించారు. వీరందరికీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ పలు సూచనలు చేశారు. ఎన్నికల సిబ్బం దికి భోజన ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ అనంతరం ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు.

31 ఆర్టీసీ బస్సుల కేటాయింపు

సత్తెనపల్లి అసెంబ్లీ ఎన్నికలకు 31 ఆర్టీసీ బస్సులను అధికారులు కేటాయించారు. ఎన్నికల సిబ్బందిని సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఆర్టీసీ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు.ఎన్నికల అనంతరం తిరిగి ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌కు చేరే వరకూ ఆర్టీసీ బస్సులు ఎన్నికల ఆధికారుల అధీనంలో ఉంటాయి.

ప్రజాశక్తి - వినుకొండ

ఎన్నికల నిర్వహణ సిబ్బందికి స్థానిక నరసరావుపేట రోడ్డులోని నిర్మల స్కూల్ వద్ద ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రిని రిటర్నింగ్ అధికారి సుబ్బారావు పర్యవేక్షణలో అందజేశారు. వినుకొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 299 పోలింగ్ బూతులు ఉండగా, ఎన్నికల నిర్వహణ సిబ్బందికి అవసరమైన వస్తువులను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 2,61,769 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 1,29,914 మంది పురుషులు, 1,31,856 మంది స్త్రీలు, 19 మంది ఇతరులు ఉన్నారు. నియోజవర్గంలో మొత్తం 27 సెక్టార్లు ఉండగా, ఒక్కొక్కరికి 8 నుంచి 10 బూతులు వరకు కేటాయించి సెక్టార్ అధికారులను నియమించి పర్యవేక్షిస్తున్నారు. ఒక్కొక్క సెక్టార్కు ఇద్దరు రూట్ ఆఫీసర్లు నియమించారు. ప్రతి పోలింగ్ బూత్ కి పీవో, ఓ పి ఓ, ఏపీవో, మైక్రో అబ్జర్వర్ లతోపాటు సహాయక సిబ్బంది ఉంటుంది. ఎన్నికలు పారదర్శకంగా ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ బలగాలతో పాటు, కేంద్ర సాయిధ బలగాలను మోహరించారు. వెబ్ కెమెరాలను ఏర్పాటు చేసి అవసరమైన చోట వీడియోలు తీయించే ఏర్పాటును కూడా చేశారు. ఎన్నికల సిబ్బందికి అప్పగించిన ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రిని తీసుకొని ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఆర్టీసీ బస్సుల్లో చేరుకున్నారు. పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు, ముందస్తు చర్యలు చేశారు.

వేసవి దుక్కులతో.. బహుళ ప్రయోజనాలు

- కలుపు నివారణ-పురుగుల నిర్మూలన-తెగుళ్ళ కట్టడికి దోహదం
- వ్యవసాయ శాఖ అధికారి వి.నరేంద్రబాబు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రభీలో పంట సమయం ముగిసిన కొన్ని రోజులలో దుక్కులు దున్నడం వలన బహుళ ప్రయోజనాలు ఉన్నాయని నరసరావుపేట మండల వ్యవసాయ శాఖ అధికారి వి.నరేంద్రబాబు అన్నారు. ఆయన ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడుతూ వేసవి దుక్కులు దున్నడం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. వేసవిలో దుక్కులు లోతుగా దున్నడం వలన నేల గుల్లబారి నీటి నిల్వ శాతం పెరుగుతుందన్నారు. భూమి లోపల ఉండే వివిధ రకాల పురుగుల గుడ్లు, ప్యూపాలు చనిపోతాయని సాగు చేసిన పంటలలో కలుపును నివారించవచ్చన్నారు. మరిన్ని విషయాలు ఆయన మాటలలో.... వేసవి దుక్కుల వలన తొలకరి వర్షపు నీరు నేలలోకి బాగా ఇంకి భూగర్భ నీటి మట్టం పెరగ డంతో పాటు నేలలో తేమ నిల్వ శాతం వృద్ధి చెంది నీరు బాగా ఇంక డంతో నేల గుల్లబారి మెత్తగా తయారై విత్తనం నాటేందుకు అను కూలంగా మారడంతో పాటు విత్తన మొలక శాతం పెరిగేందుకు వేసవి దుక్కులు దోహదం చేస్తాయి. గత పంట వ్యర్థాలు తగుల బెట్ట కుండా పొలంలో కలియదున్నడం వలన చెత్త, ఆకులు, నేలలో కలిసి సేంద్రీయ పదార్థంగా మారి నేల సారం పెరుగుతుంది. సాగు ఆరంభంలో చేసే కొన్ని పనులు దిగు బడిపై ప్రభావం చూపుతాయి. అటువంటి వాటిలో వేసవి దుక్కులు ప్రధానం. నేల లోపలి గట్టి పొరలను పగులగొట్టడంతో మొక్కల వేరు వ్యవస్థ లోపలికి చొచ్చుకుని వస్తాయని వేరు వ్యవస్థ నేలలోకి బాగా విస్తరిస్తాయి. దీని ద్వారా తుపాను, ఈదురు గాలుల ప్రభా వాన్ని కొంతమేర తట్టుకునే అవకాశం ఉంది. మొక్కల ఎదుగుదలకు కావాల్సినంత తేమ, పోష కాలు సమకూరు తాయి. దీంతో నాణ్యమైన దిగుబడి వస్తుంది. పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవుల చర్యలను కూడా అభివృద్ధి పరిచేం దుకు ఈ వేసవి దుక్కులు దోహదం చేస్తాయి. లోతు దుక్కులతో పొలంలో ఉండే మొండి జాతి కలుపు మొక్కలైన గరిక, తుంగ ఇతర దుంపలతో సహా పెకి లించ వచ్చు. దీంతో అవి ఎండిపోయి కలుపు సమస్య తగ్గుతుంది.తొలకరి వర్షాలు పడిన వెంటనే భూమిని లోతుగా దున్ని కింది నేలను పైకి వచ్చేట్లు చేయ డంతో నిద్రావస్థలో ఉన్న వివిధ పురుగుల గుడ్లు, ప్యూపాలు సూర్యరశ్మి తాకిడికి చనిపోతాయి. వేసవి దుక్కులతో వరి పైరును ఆశించే కాండం తొలుచు పురుగు మొక్క జొన్నలో వచ్చే పురుగుల ఉధతిని తగ్గించ వచ్చు. భూమిలో ఉండి సాగు కాలంలో పైరును ఆశించే వివిధ రకాల శిలింధ్రాలు వేసవిలో చేపట్టే లోతు దుక్కు లతో ఎండ తాకిడికి చనిపోతాయి. తర్వాత పంట కాలంలో ఈ తెగుళ్ల తీవ్రత తగ్గు తుంది. రైతులు తప్పనిసరిగా వేసవిలో దుక్కులకు ప్రాధాన్యత ఇచ్చి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఆకాంక్షిస్తు న్నట్లు పేర్కొన్నారు.


ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

పోలింగ్ కేంద్రాల్లో సర్వం సిద్ధం



ప్రజాశక్తి - పొన్నూరు

సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకొని సోమవారం జరగనున్న పోలింగ్ ప్రక్రియలో ఓటర్లు తమ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకున్నందుకు పోలింగ్ ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. స్థానిక సెయింట్ ఆన్స్ హై స్కూల్ లో పంపిణీ కేంద్రాల నుంచి సెక్టార్లవారీగా పోలింగ్ సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ప్రత్యేక వాహనాల ద్వారా తరలి వెళ్లారు. పోలింగ్ కేంద్రాలలో ఉదయం ఐదున్నర గంటలకు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ జరుగుతుందని పొన్నూరు సెగ్మెంట్ రిటర్నింగ్ అధికారి లక్ష్మీ కుమారి విలేకరులకు తెలిపారు. ఉదయం 7 గంటల నుండి 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. 264 పోలింగ్ కేంద్రాలకు 27 సెక్టార్లను ఏర్పాటు చేసి అధికారుల ద్వారా తరలించినట్లు చెప్పారు. పొన్నూరు నియోజకవర్గం ఓటర్లు 2,27,135 తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు చెప్పారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. పోలింగ్ ప్రశాంతం జరిగేలా ప్రజలు సహకరించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, హోమ్ ఓట్లు ప్రక్రియ పూర్తయిందని అన్నారు.


లింగాయపాలెంలో పోలింగ్ కేంద్రం

59 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

ప్రజాశక్తి-చేబ్రోలు

పార్లమెంట్,అసెంబ్లీ ఎన్నికల కోసం మండల వ్యాప్తంగా 71 పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.జ్యోతి చెప్పారు. ఆదివారం మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు అందరూ ఎన్నికల సెక్టార్ అధికారులు, రూట్ ఆఫీసర్లు పోలింగ్ సిబ్బందిని పంపినట్లు తెలిపారు. పోలింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్, సంబంధిత అధికారులు ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన కూలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో మొత్తం 71 పోలింగ్ కేంద్రాల్లో 59 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్లు చెప్పారు. ఈ పోలింగ్ కేంద్రాలలో అవసరమైన అన్ని సౌకర్యాలు, ఏర్పాట్లు చేశామన్నారు. మండల వ్యాప్తంగా 900 నుండి 1000 మంది వరకు ఎన్నికల విధుల నిర్వహణలో ఉన్నట్లు చెప్పారు.



వర్షం కారణంగా ఏర్పాట్లకు అంతరాయం

ప్రజాశక్తి- తుళ్లూరు

మండలంలో ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది. స్థానిక కెవిఆర్ జడ్పీ హైస్కూల్, బాపూజీ ఎంపిపి స్కూల్ తో పాటు మండలపరిధిలో పలు పాఠశాల భవనాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కెవిఆర్ జడ్పీ హైస్కూల్లో ఏర్పాట్లను జూనియర్ అసిస్టెంట్ (పిఎస్- 26) బిఎల్ఓ శ్రీవిద్య ఆదివారం పరిశీలించారు. వర్షం కారణంగా ఏర్పాట్లకు అంతరాయం కలుగుతోందని చెప్పారు. మండల పరిధిలోని దొండపాడు, బోరుపాలెం,వడ్డమాను పెదపరిమి, శాఖమూరు, ఐనవోలు,లింగాయపాలెం తదితర గ్రామాల్లో ఏర్పాట్లు దాదాపు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

66 పోలింగ్ కేంద్రాలు

ప్రజాశక్తి-తాడికొండ

మండలంలోని 15 గ్రామాలలో 57 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 66 పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆదివారం సాయం కాలానికి ఈవీఎంలతో ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పోలీసులు పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మొబైల్ పార్టీలు గస్తీ నిర్వహించిన వారి కళ్ళు గప్పి డబ్బు మద్యం పంపిణీ జరుగుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వారు తమ ఓటు హక్కును వినియోగించు కోవడానికి సొంత గ్రామాలకు చేరుకున్నారు.



పొన్నెకల్లులో పోలింగ్ కేంద్రం


వికలాంగుల కోసం వీల్‌చైర్లు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నియోజకవర్గం మొత్తం మీద 288 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ప్రత్తిపాడు రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీ కార్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వికలాంగుల సౌలభ్యం కోసం వీల్ చైర్లు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో టెంట్లు ,కుర్చీలు, తాగునీరు సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు.


ఐతానగర్ ఎర్రబడి పోలింగ్ కేంద్రం

ప్రజాశక్తి-తెనాలి

పోలింగ్ కేంద్రాలకూ పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. పట్టణ, రూరల్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లో తోపులాట లేకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఐతానగర్ ఎర్ర బడి వద్ద కట్టుదిట్టంగా చేసిన ఏర్పాట్లను ఆ కేంద్రానికి కేటాయించిన పోలింగ్ అధికారి పరిశీలించారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఏర్పాట్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు.



కొర్రపాడులో రెండు వరిగడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి - మేడికొండూరు

రెండు వరిగడ్డివాములు దగ్ధ మైన సంఘటన మండలంలోని కొర్రపాడులో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. గ్రామానికి చెందిన అన్న దమ్ములు కొర్నె హుస్సేను, చిన్న వీర య్యలు వ్యవసాయంపైనే జీవనాధా రం. తమ ఇళ్లకు సమీపంలోని ఖాళీ స్థలంలో ఇరువురు రెండు వేరు, వేరు మూడు ఎకరాల గడ్డివాములను ఏర్పాటు చేసుకున్నారు. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా మం టలు చిల్లరేగాయి. మదనపల్లి నుండి అగ్నిమాపక శాఖ వాహనం వచ్చే లోపు రెండు వరిగడ్డివాములు పూర్తిగా తగలబడిపోయాయి. తెలుగు రాలేదు. తగలబడిన రెండు వరిగడ్డి వాముల విలువ రూ. 1. 50 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.



పారిశుధ్యకార్మికులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వ ర్యంలో ఆదివారం టెలిఫోన్ ఎక్ఛేంజ్ వద్ద పురపాలక సంఘ పరిధిలోని మహిళా పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షులు ఎస్.రాంబాబు మాట్లాడుతూ క్లబ్ సభ్యులు డాక్టర్ కొత్తపల్లి రాజ్ కుమార్, సుమతి దంపతులు పెళ్లిరోజు సందర్భంగా వారి సహకారంతో సేవా కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. డాక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వ హిస్తున్నామని, మరి ముఖ్యంగా పేదలు, విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

డబ్బు కోసం ఓటర్ల ఎదురుచూపు!

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు ఓటర్లకు డబ్బు చెల్లింపు విషయమై ఆయా పార్టీల నాయకులు గందరగోళం సృష్టిస్తున్నారు. అధినాయకులు పంపించినట్లుగా తమకు డబ్బులు ఇవ్వడం లేదని, వీధి వీధినా ఓటర్లు ఎదురుచూస్తున్నారు. సెకండరీ నాయకత్వానికి డబ్బులు పంపిణీ కార్యక్రమం అధినాయకత్వం కేటాయించి నట్లుగా తెలిసింది. ఆ నాయకత్వం ఓటర్లకు డబ్బులు ఇవ్వ కుండా వాళ్ళ పేర్ల ముందు రౌండప్ చేసి మీకు విచ్చేసినట్లుగా ఉందని చెల్లించకుండా వెళ్ళి పోతున్నారు. ఈ విధంగా అధి కార వైసిపి, ప్రతిపక్ష టిడిపి పార్టీల ఓటర్లు ఆందోళన పడు తున్నారు. కొన్ని కొన్ని సెంట్రల్ నుండి ఆయా పార్టీ కార్యాలయా లకు వచ్చి డబ్బులు ఇవ్వలేదని ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో పార్టీ నాయకులకు ఏం చేయాలో తలపట్టుకుంటున్నారు. ఈ విధంగా పంపిణీ అలసత్వం వహిస్తే సోమ వారం ఓటు వేయడానికి కూడా రావడానికి కొంతమంది ఇష్టపడ´డం లేదు. డబ్బు చెల్లిస్తేనే ఓటుకు వస్తామని మాటలు విన వస్తు న్నాయి. గతంలో ఈ విధంగానే మంగళగిరి నియోజకవర్గంలో జరి గింది. సాయంత్రం నాలుగు గం టల తర్వాత డబ్బులు పంపిణీ జరిగిన తర్వాతనే ఓటు వేశారు. ఏదేమైనా ఎన్నికలు కొంతమంది దళారులకు డబ్బు కాజేసేందుకు ఉపయోగపడుతోంది.


గౌతమ్ బుద్ధ రోడ్ లోని శ్రీనివాస్ మహల్ వద్ద డబ్బులు కోసం ఎదురుచూస్తున్న ఓటర్లు


ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్‌దూది, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్‌తో కలసి ఆచార్య నాగార్జునా యూనివర్శిటిలో గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం, ఏడు శాసన సభ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవియంలు భద్రపరచే స్ట్రాంగ్ రూమ్స్ వద్ద పోలింగ్ సిబ్బంది నుండి ఈవియంలను తీసుకొనే రిసెప్షన్ కౌంటర్ల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల నుండి యూనివర్శిటికీ వచ్చే వాహనాలు, తిరిగి వెళ్ళే వాహనాలతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు. రిసెప్షన్ కౌంటర్ల వద్ద ఈవియంల స్వీకరణ, వాటిని సంబంధిత స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే మార్గాల్లో బారికేడింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని, పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీఖర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాజ్యాలక్ష్మీ , పోలీసు అధికారులు పాల్గొన్నారు.


మెటీరియల్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

గుంటూరు పశ్చిమలో ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నేటి పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం స్థానిక లాడ్జి సెంటర్‌లోని ఏఎల్ బిఇడి కాలేజిలో పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ అందచేసి, వారిని ప్రత్యేక బస్సులలో పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. పోలింగ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో చేరుకోవటంతో కోలాహలంగా మారింది. మెటీరియల్ పంపిణీ ప్రక్రియను నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ కె.రాజ్యలక్ష్మి పర్యవేక్షించారు. నియోజకవర్గంలో 291 మంది పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 28 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 350 మంది పోలింగ్ ఆఫీసర్లు, 350 మంది అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, 1800 మంది అదర్ పోలింగ్ ఆఫీసర్లు, 47 మందిని మైక్రో అబ్జర్వర్లను నియమించారు. అలాగే 2,78,158 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 1,35,426, మహిళలు 1,42,688, ఇతరులు 44 మంది ఉన్నారని తెలిపారు.వారిని పోలింగ్ కేంద్రాల వారీగా విభించి, వారికి మెటీరియల్ అందచేశారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు పూర్తి చేశామని, పోలింగ్ స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్ఓ తెలిపారు.ప్రజలు అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

గుంటూరు తూర్పులో సర్వం సిద్ధం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఆదివారం స్థానిక ఏసీ కాలేజిలో ఏర్పాటు చేసిన మెటీరియల్ పంపిణీ కేంద్రంలో ఎన్నికల సిబ్బందికి ఇవిఎంలు, కంట్రోల్ యూనిట్స్, ఇతర పోలింగ్ సామాగ్రిని అందచేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులలో రూట్‌ల వారీగా ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని నగర కమిషనర్, నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ కీర్తి చేకూరి ప్రత్యక్ష పర్యవేక్షణ చేశారు. నియోజకవర్గంలో 255 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 306 మంది పిఒలు, 306 మంది ఏపిఒలు, 1224 మంది ఓపిఓలు ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా 22 మంది సెక్టార్ అధికారుల్ని, 22 మంది రూట్ అధికారుల్ని నియమించి మెటీరియల్‌ను భద్రత మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించారు. అలాగే 71 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. నియోజకవర్గంలో మొత్తం 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 2,50,691 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 1,21,849, మహిళలు 1,28,808, ఇతరులు 34 మంది ఉన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ విధుల సమన్వయం కోసం జిఎంసి సీనియర్ అధికారులను సూపర్వైజరి అధికారులుగా నియమించి, ప్రదాన కార్యాలయంలో స్పెషల్ టీంతో కంట్రోల్‌రూమ్, క్విక్ రియాక్షన్ టీం, ఈ వి ఎం ల లో సాంకేతిక లోపాలు ఎదురైతే పరిష్కారానికి భెల్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు.


సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్

నిఘా నీడలో గురజాల పోలింగ్ కేంద్రాలు

వెబ్ క్యాస్టింగ్ కెమెరాలతో అధికారుల పర్యవేక్షణ - రెండోసారి ఓటు వేస్తే జైలుకే

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

నేడు జరగున్నున ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ సమస్యాత్మక నియోజకవర్గంగా గురజల మూడవ స్థానంలో ఉండటంతో అధికారులు గురజాల నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. పూర్తి స్థాయి బందోబస్తు ఏర్పాటు సిసి కెమెరాల ఏర్పాటు మరియు రౌడీషీటర్స్,ట్రబుల్ మాంగర్స్‌ను బైండోవర్ చేయడం వంటి చర్యలను చేపట్టారు.గురజాల నియోజకవర్గం సమస్యాత్మక నియోజకవర్గం కావడంతో అధికారులు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. గురజాల నియోజకవర్గంలోని 304 పోలింగ్ కేంద్రాలులో ఏర్పాటు చేసిన కెమెరాలు జిల్లా,రాష్ట్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణలో ఉంటాయని అధికారులు తెలిపారు.గడిచిన ఎన్నికల్లో నియోజకవర్గంలోని పలు కేంద్రాల వద్ద గొడవలు జరగడం,పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద వైసిపి, టిడిపి పార్టీలు బాహాబాహీ అవ్వడం, వైసిపి అభ్యర్ధి కాసు మహేష్ రెడ్డి వాహనాలు మండంలంలోని పాత గణేశునిపాడు గ్రామంలో ధ్వంసం చేయడం, గురజాల మండలం జంగమహేశ్వర పురం గ్రామంలో ఎన్నికల రోజు సాయంత్రం రెండు పార్టీలు రాళ్ళు రువ్వకోవడం వంటి సంఘటనలు జరగడంతో అధికారులు గురజాల నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు. నేడు జరగబోయే ఎన్నికలు ప్రశాంతగా నిర్వహణ జరిగేందుకు మరియు ప్రజలు వారి ఓటు హక్కును ఇబ్బందులు లేకుండా వినియోగించుకునేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. గురజాల నియోజక వర్గంలో 2019 సంవత్సరంలో 2,68,469 ఉండగా అందులో 2,25,103 మంది ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 83.81శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారలు తెలిపారు.ప్రస్తుతం గురజాల నియోజకవర్గంలో 2,72,152ఓట్లు ఉన్నాయని అధికారులు తెలిపారు.పోలింగ్ కేంద్రాలకు ఓటు వేయడానికి వచ్చే వారు సెల్ ఫోన్లు తీసుకురాకూడదని తెలిపారు.ఉదయం 7గంటల నుండి పోలింగ్ ప్రారంభం అవతుందని ఓటింగ్‌కు అధికారులు తెలిపిన గుర్తింపు కార్డులతో రావాలని సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగుతుందని అధికారులు తెలిపారు.





రెండో సారి ఓటు వేసే వారిని గుర్తించవచ్చు

నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన వెబ్ క్యాస్టింగ్ కెమెరాలతో రెండో సారి ఓటు వేసే వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయవచ్చునని అధికారులు తెలపుతున్నారు.ఒక వ్యక్తి తన ఓటు హక్కును ఒకసారి వినియోగించుకుని మరోసారి ఓటు వేసేందుకు వస్తే వెబ్ క్యాస్టింగ్ కెమెరాలో అంతా రికార్డు అవుతందని సదరు వ్యక్తిపై ఎవరైన ఫిర్యాదు చేస్తే అధికారులు వెబ్ క్యాస్టింగ్‌లో రికార్డు అయిన విడియో ఆధారంగా వ్యక్తిపై కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని అధికారులు తెలుపుతున్నారు.ఒకే వ్యక్తికి రెండు,మూడు చోట్ల ఓటు ఉండటంతో కొన్ని పార్టీలకు చెందిన వారు వారి ఓటును మరల వేయించేందకు ప్రయత్నాలు చేస్తుంటారు.అలాంటి వారికి వెబ్ క్యాస్టింగ్ కెమెరాల ద్వారా అధికారులు చెక్ పెట్టారు.

పెదపరిమి పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పి

ప్రజాశక్తి - తుళ్లూరు

గుంటూరు జిల్లా తుళ్లూరు సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదపరిమి గ్రామంలో జిల్లా ఎస్‌పి తుషార్ దూడి పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. సమస్యాత్మక కేంద్రాలుగా ఉన్న వాటిని ఆయన తనిఖీ చేశారు. ఎంపిపి పాఠశాల, ఆదిఆంధ్ర న్యూ బిల్డింగ్ లో ఉన్న పాఠశాల, సెయింట్ మేరీ ప్రైమరీ స్కూల్స్ బందోబస్తుపై చర్చించారు. స్కూల్ చుట్టు ప్రక్కల నివాసం ఉంటున్న ప్రజలతో మమేకమైన ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణ సమస్యాత్మక పోలింగు కేంద్రం ను సందర్శించి, చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.బారికేడ్ల ఏర్పాటు, ఓటర్ల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ తదితర విధివిధానాలపై క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేసారు. పోలింగు రోజున పోలింగు కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకునే వారు తప్పా ఇంకెవ్వరూ ఉండకుండా చూడాలని అధికారులను కోరారు. అంతేకాకుండా వేసవి కాలం కనుక పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు మౌలిక సదుపాయాల గురించి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. గత ఎన్నికల సమయంలో ఈ పోలిక కేంద్రంలో జరిగిన సంఘటనలు దష్టిలో ఉంచుకుని ఎలక్షన్ రోజు ముందస్తుగా పోలీసు వారు తీసుకునే చర్యలకు సంబంధించి అధికారులకు పలు సూచనలు సూచించారు అదే విధంగా ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లు సమాచారం తెలిస్తే సి-విజిల్ యాప్ ద్వారా, (లేదా) టోల్ ఫ్రీ నంబర్ 112 లకు లేదా దగ్గరలోని సంబంధిత పోలీసు స్టేషన్ నందు ఫిర్యాదు చేయవచ్చు. అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.


పెదపరిమిలో ఎన్నికల నిర్వహణ పై స్థానికులతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ దూడీ

ఊపిరితిత్తుల వ్యాధులపై ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం ఊపిరితిత్తుల సమస్యలపై ఆరోగ్య సభ నిర్వహిం చారు. ఈ సభలో ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ వై.యస్.హిమజ ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడుతూ ఊపిరితిత్తులు శరీరంలోని వివిధ అవయవాలకు ఆక్సిజన్ అందిస్తాయని, ఊపిరితిత్తులు పనితీరు సరిగా లేకుంటే మానవునికి ఎంత ప్రమాదమో ఇటీవల కరోనా సమయంలో అందరం అనుభవ పూర్వకంగా తెలుసుకొన్నామని చెప్పారు. ఊపిరితిత్తుల పనితీరు సక్రమంగా ఉండటానికి ప్రాణాయామం, ఇతర బ్రీతింగ్ ఎక్సర్సైజెస్ చాలా మంచిదని తెలిపారు. ఊపిరితిత్తుల సమస్య ఏర్పడినప్పుడు ఆయాసం, పిల్లికూతలు, చాతిలో నొప్పి లాంటి లక్షణాలు ఉంటాయని, దగ్గు కళ్లె లాంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. ధూమపానం, వాతావరణ కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు కలుగుతున్నాయన్నారు. మన ఊపిరితిత్తులు పనితీరు తెలుసుకోవటానికి పల్మనరీ ఫంక్షన్ టెస్ట్, ఎక్స్‌రే ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఊపిరితిత్తులకు, గుండెకు అవినాభావ సంబంధం ఉన్నందున రెండింటిలో ఏ ఒక్కటి అనారోగ్యానికి గురైనప్పటికీ రెండవ అవయవం త్వరగా అనారోగ్యానికి గురి అయ్యే అవకాశం ఉందన్నారు. కావున రోజు ప్రాణాయామం, వివిధ రకాల శ్వాస సంబంధిత ఎక్సర్‌సైజ్ చేస్తూ, బయటకు వెళ్లినప్పుడు సాధ్యమైనంత వరకూ మాస్కులను ధరించాలని, అవకాశం ఉన్నంతవరకు ఆక్సిజన్ ఇచ్చే మొక్కలను పెంచుతూ, ఒత్తిడి లేకుండా జీవిస్తే ఊపిరితిత్తుల సమస్యలు దరిచేరవన్నారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ వై.యస్ .హిమజను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశానికి కోఆర్డినేటర్‌గా టీ.వీ.సాయిరాం వ్యవహరించగా, రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు వరకమలాదేవి, రచయిత్రి టి.పద్మావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ హిమజ

ఓటు వేసేందుకు ఈసీ గుర్తించే 12 ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు పత్రాలు ఇవే..

1. ఆధార్‌కార్డు , 2. ఉపాధి హామీ కార్డు
3. జాబ్ కార్డు , 4. బ్యాంకు/తపాలా కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్
5. కేంద్ర కార్మికశాఖ పథకం కింద జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు , 6. డ్రైవింగ్ లైసెన్స్ ,
7. పాన్‌కార్డు , 8. రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్, ఇండియా(ఆర్జీఐ).. నేషనల్ పాపులేషన్ రిజిస్ట్రార్(ఎన్పిఆర్) కింద జారీ చేసిన స్మార్ట్ కార్డు
9. భారతీయ పాస్‌పోర్టు
10. ఫొటోతో ఉన్న పెన్షన్ పత్రాలు
11. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/పీఎస్‌యూలు/ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగి గుర్తింపు కార్డులు 12. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజెబిలిటీ గుర్తింపు కార్డు(యూడీఐడీ)
13 ఓటు వేయడానికి బయటకు వెళ్లేటప్పుడు ఎవరూ తన మొబైల్‌ని తీసుకెళ్లకూడదు.